నామినేషన్ల పర్వం షురూ..

- హోరెత్తనున్న ప్రచారం
- సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం
- కొనసాగుతున్న పార్టీ మార్పులు


నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి శశాంక

మణికొండ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో జరగనున్న పార్లమెంట్ సభ్యుల ఎన్నికలకు నామినేషన్ల పర్వం మొదలయ్యింది. ఎన్నికలకు ఇక 25 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఇంటింటి ప్రచారానికి అన్ని పార్టీలు రంగం సిద్ధం చేసుకున్నాయి. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే అక్కడక్కడ కొందరు నాయకులు ప్రచారాన్ని చేపడుతున్నా పూర్తి స్థాయిలో మాత్రం శుక్రవారం నుంచి మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కావటంతో మొదటి రోజు మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి.

మారిన అభ్యర్థులు..

2019 సంవత్సరంలో జరిగిన ఎంపీ ఎన్నికల్లో పోటీ పడిన ఇద్దరు ప్రధాన అభ్యర్థులు ప్రస్తుతం పోటీ చేస్తున్నారు. అయితే అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి ఎంపీగా గెలుపొందిన డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి ఈసారి ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో ఉన్నారు. గతంలో కాంగ్రెస్ తరపున పోటీ చేసి 14,698 ఓట్ల తేడాతో ఓడిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఈసారి బీజేపీ పార్టీ తరపున పోటీలో ఉన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ, బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను రంగంలోకి దించింది. దీంతో రెండు జాతీయ పార్టీల తరపున రెడ్డీలు, బీఆర్ఎస్ పార్టీ తరపున బీసీ నాయకుడు పోటీలో ఉన్నారు. ముగ్గురు బలమైన ప్రత్యర్థులే కావటంతో గెలుపు ఎవరిని వరిస్తుందనే విషయం ఎన్నికల ఫలితాలు వెలువడితేనే తెలుస్తుందని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, చేవెళ్ల నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలుగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉండగా పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.

రాజేంద్రనగర్‌లో పట్టం ఎవరికి..?

2019 ఎంపీ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు అత్యధికులు పట్టం కట్టారు. ఆయన సమీప ప్రత్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి 70162 ఓట్లు రాగా డాక్టర్ రంజిత్‌రెడ్డికి 98,748 ఓట్లు వచ్చి 28,586 ఓట్ల ఆధిక్యం దక్కింది. అదే ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన బి.జనార్దన్‌రెడ్డికి 51,349 ఓట్లు వచ్చాయి. అప్పట్లో నియోజకవర్గంలోని మెజార్టీ ఓటర్లయిన మైనార్టీలు బీఆర్ఎస్ పార్టీ వైపు ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్ వైపు మొగ్గు తున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ తరపున బీసీ ఉద్యమ నాయకుడు రంగంలో ఉండటంతో ఆ వర్గం ఓట్లు ఆయనకు పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 1,21,734ఓట్లు, బీజేపీకి 89,638 ఓట్లు, కాంగ్రెస్‌కు 82,057ఓట్లు, ఎంఐఎంకు 25,670 ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం ఎంఐఎం అభ్యర్థి పోటీలో ఉండే అవకాశం లేదని, వారితో పాటు పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు అత్యధికంగా కాంగ్రెస్‌కే ఓటు వేసే అవకాశం ఉందని ముస్లిం నాయకులే అభిప్రాయపడుతున్నారు. బలమైన బీసీ నాయకున్ని రంగంలోకి దించిన బీఆర్ఎస్ పార్టీ వైపు బీసీలతో పాటు గతంలో ఉన్న మైనార్టీలు ఎంత మంది నిలుస్తారనే విషయం నియోజకవర్గ వ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. ఎంపీ ఎన్నికలు కావటంతో దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ హవా కొనసాగుతుండటం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీసీ నాయకుడు బీఆర్ఎస్ తరపున రంగంలో ఉండటంతో గెలుపు ఎవరిదనే విషయంలో సర్వత్రా చర్చ కొనసాగుతుంది.


ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న మధు


స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రిజ్వాన్


సోషలిస్ట్ పార్టీ ఇండియా పార్టీ అభ్యర్థిగా నామినేషన్ అందజేస్తున్న రమేశ్ బాబు

మొదటిరోజు మూడు నామినేషన్లు..

రాజేంద్రనగర్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల దాఖాలు కేంద్రాన్ని రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మొదటి రోజు మొత్తం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయని జిల్లా రిటర్నింగ్ అధికారి శశాంక్ తెలిపారు. సోషలిస్టు పార్టీ ఇండియా పార్టీ అభ్యర్థిగా బి.వెంకట్ రమేశ్ బాబు, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ ముస్తాఫా రిజ్వాన్, ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థిగా పాలమాకుల మధులు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్ల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వస్తున్న వారిని క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థితో పాటు వెంబడి కేవలం ఐదుగురికి మాత్రమే అనుమతించారు.

ఉక్కపోత నుంచి ఉపశమనం


ముచ్చింతల్‌లో వాన కురవడంతో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

శంషాబాద్ రూరల్: అకాల వర్షం కాస్త ఉక్కపోత నుంచి ఉపశమనం కల్గించింది. మండలంలో పలు చోట్ల గురువారం ఓ మాదిరి వర్షం కురిసింది. ముచ్చింతల్, పాల్మాకుల, మదన్‌పల్లి, పెద్దతూప్ర గ్రామాల్లో సాయంత్రం కురిసిన వానతో రోడ్లపై వరద నీరు పారింది. ఉదయం నుంచి ఎండ దంచి కొట్టగా..సాయంత్రం వాతావరణం చల్లబడింది.

మహావీర్ కళాశాలలో ‘టెక్నోమిస్ట్ 2024’



మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు టెక్నో మిస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా టెక్నోమిస్ట్ 2024లో భాగంగా ట్రెడిషనల్ డేలో వివిధ కళాశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పోస్టర్ పేపర్ ప్రెసెంటేషన్‌లో పాల్గొన్నారు. దీనితో పాటు ముగ్గుల పోటీలు, బతుకమ్మ పోటీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు ట్రెడిషనల్ డే, అన్యువల్ డే, గ్రాడ్యుయేషన్ డేలలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంరెడ్డి జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ట్రెజరర్ అగ్నిహోత్రి, కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ, కన్వీనర్ స్వప్న, సీఎస్ఎం, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సందడిగా శోభాయాత్ర


శోభాయాత్రలో నృత్యం చేస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: శివరాంపల్లిలో నిర్వహించిన శోభాయాత్రకు రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి బుధవారం రాత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి కొండా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హిందూ ధర్మ పరిరక్షణకు యువకులంతా ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సమైక్యభావంతో కలిసి జీవిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. గత పదేళ్లుగా శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను కొండా విశ్వేశ్వర్ రెడ్డి అభినందించారు.

బీజేపీతోనే చేవెళ్ల అభివృద్ధి: కొండా విశ్వేశ్వర్ రెడ్డి


బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న విశ్వేశ్వర్ రెడ్డి

రాజేంద్రనగర్: భారతదేశం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం తెలంగాణ జాగృతి అసెంబ్లీ కన్వీనర్ కొండా పరమేశ్ గౌడ్ తన అనుచరులు 50 మందితో కలిసి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో ఆయన కార్యాలయంలో బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు దేవేందర్, కౌన్సిలర్ కొండా ప్రవీన్ గౌడ్, పత్తి శ్రీనివాస్, భీమార్జున రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డె నరసింహా, మల్లేష్ కురుమ, సిద్దులు కురుమ, సురేందర్‌తో పాటు నూతనంగా చేరిన చంటి, కొండా సృజన్ గౌడ్, రాజు, ప్రసాద్, జయరాం, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నగరంలో అబ్బుర పరుస్తున్న ప్రపంచ స్థాయి నిర్మాణాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అబ్బుర పరుస్తున్న ప్రపంచ స్థాయి నిర్మాణాలు జరుగుతున్నాయని సినీ నటి దివీ అన్నారు. మణికొండలో గురువారం ది డికోవాల్ సంస్థ ఏర్పాటు చేసిన 3డీ వాల్ ప్యానెల్స్ స్టోర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి దివీ మాట్లాడుతూ.. 3డీ వాల్స్‌ను తొలిసారిగా తాను హైదరాబాదులో చూస్తున్నానని.. ఇటువంటి కొత్త టెక్నాలజీని నగరవాసులకు పరిచయం చేయడం మంచి పరిణామన్నారు. సంస్థ వ్యవస్థాపకులు ఎల్ల శ్రీకాంత్ చౌదరి, లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే పీటీపీ కాకుండా సహజ సిద్ధంగా లభించే జిప్సమ్ మెటీరియల్‌తో ఈ వాల్ ప్యానెల్స్‌ను తయారు చేస్తామన్నారు. ఇది దేశంలోనే తొలి స్టోర్ అని త్వరలోనే మిగతా నగరాలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకులు శ్రీరామ్ ఆదిత్య, శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మెడికల్ హెల్త్ క్యాంపులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి ఇందిరా

మైలార్‌దేవ్‌పల్లి: మహిళలు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి ఇందిరా అన్నారు. గురువారం లక్ష్మిగూడలోని వాంబేకాలనీలో బటర్ ఫ్లై హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డి ఇందిరా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలు తమ రోజు వారి డైట్‌లో కచ్చితంగా తీసుకోవాల్సిన పోషకాలలో ఫోలేట్ ఒకటి అని అన్నారు. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ ఉత్పత్తిని మెరుగుపరచడంలో సహాయం చేస్తుందని తెలిపారు. గర్భాధారణ సమయంలో మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు తెలిపారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్య వంతులు కావాలంటే కేవలం శారీరకంగానే కాదు, మానసికంగా ధృడంగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బటర్ ఫ్లై మేనేజింగ్ డైరెక్టర్ వసంత్ కుమార్, డాక్టర్‌లు ప్యారాలిగల్ వలంటీర్లు బాలరెడ్డి, సీహెచ్ రఘునాథ్ పాల్గొన్నారు.

మహిళలు, యువతకు సాధికారత కల్పనే లక్ష్యం

ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ హెడ్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సుజ్ఞాన్ వెంకటేష్


సర్టిఫికెట్లు అందజేస్తున్న సుజ్ఞాన్ వెంకటేష్

రాయదుర్గం: అట్టడుగు వర్గాల మహిళలు, యువతకు సాధికారత కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నా మని ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్‌హెడ్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ సుజ్ఞాన్ వెంకటేష్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఏడీపీ కార్యాలయంలో గురువారం సీఎస్ఆర్ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 180 మంది మహిళలు, యువత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పించే దిశగా వారి ప్రయాణంలో ఒక మైలురాయిని సూచించేలా చేయాలనే తపనతో ముందుకుసాగుతున్నామన్నారు. ఏడీపీ ప్రారంభించి నప్పటి నుంచి ఇప్పటి వరకు 3,300 మంది మహిళలకు మద్దతు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిద్దప్ప



మణికొండ: బీజేపీ ఓబీసీ మోర్చా విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మణికొండ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జొన్నాడ సిద్దప్పను నియమించారు. ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ గురువారం విలేకర్లకు ఆ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సిద్దప్ప మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి మూడు దశాబ్దాలుగా బీజేపీలోనే కొనసాగుతున్నానన్నారు. గ్రామ కమిటీ, మండల కమిటీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా పలు పదవులలో పార్టీకి తనవంతు కృషి చేశానన్నారు. ప్రస్తుతం ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించడం ఆనందంగా ఉందని, ఓబీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు.

జీఎంఆర్ విమానాశ్రయానికి మరో అంతర్జాతీయ అవార్డు


అవార్డును అందుకుంటున్న ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్

శంషాబాద్: జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయానికి మరో అంతర్జాతీయ అవార్డు దక్కింది. జర్మనీకి చెందిన స్కైట్రాక్ సంస్థ ‘ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2024 బెస్ట్ ఎయిర్‌పోర్టు దక్షిణాసియా’కింద ఈ అవార్డును జర్మనీలో బుధవారం రాత్రి అందజేసినట్లు జీఎంఆర్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయం ఉద్యోగులు, సిబ్బంది వందశాతం కృషి చేస్తున్నారన్నారు. ప్రయాణికులకు సాంకేతికంగా సులభతరమైన ప్రయాణ అనుభూతులను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతలో కూడా విమానాశ్రం అగ్రభాగాన ఉందన్నారు. అవార్డు రావడం విమానాశ్రయ ఉద్యోగ, సిబ్బందికి ప్రోత్సాహకంగా మారిందన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కాచిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వట్టేపల్లి తీగల కుంట ముస్తాఫ నగర్‌కు చెందిన సయ్యద్ నయీమ్(28) ఎలక్ట్రీషియన్. రెండేళ్ల క్రితం పెళ్లి అయింది. ఇతనికి ఒక కుమారుడు ఉన్నాడు. చెప్పుకోని సమస్యలు ఉన్నందున ఆత్మ హత్య చేసుకుంటున్నాని ఓ వీడియో తీసుకొని బుధవారం రాత్రి ఉడంగడ్డ రైల్వేట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్మీకి చెందిన స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ షాదన్ కళాశాల ప్రాంతంలో ఆర్మీకి చెందిన ఖాళీ స్థలం ఉంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆర్మీ సిబ్బంది రాజేంద్రనగర్ పోలీసులకు బుధవారం సాయంత్రం సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మూడు రోజుల క్రితం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చునని వెల్లడించారు. అతని వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదన్నారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

మత్తులో రోడ్లపై తిరుగుతున్న యువకులకు జైలు

గోల్కొండ: మత్తులో రోడ్లపై తిరుగుతూ హంగామా చేస్తున్న ఐదుగురు యువకులకు జైలు శిక్ష పడింది. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ఎండిలైన్స్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోని విచారించారు. అయితే వారు మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రతినిత్యం మద్యం మత్తులో రోడ్లపై తిరుగుతూ స్థానికులకు ఇబ్బందులు కలగచేస్తున్నారని పోలీసులకు తెలిసింది. దీంతో వారిని గురువారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి మహ్మద్ అసర్(26), షేక్ అజ్మత్(26), మహ్మద్ హాజీ(24), సయ్యద్ రిజ్వాన్(21), ఎస్.కె. సలీం(30)కు మూడు రోజుల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.50 వేల జరిమానా విధించారు.

నీటి సమస్యలను నివారించండి


సమీక్ష సమావేశంలో పాల్గొన్న మున్సిపల్, జలమండలి అధికారులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా, ట్యాంకర్ల సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడటంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం శ్రీమన్నారాయణ, మేనేజర్ స్ఫూర్తిరెడ్డితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు నీటి సరఫరా లో ప్రెషర్‌తో జరుగుతుందని, ఏ మాత్రం సరిపోవటం లేదని, ట్యాంకర్లు బుక్ చేసిన రెండు రోజుల తర్వాత సరఫరా అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి ప్రస్తుతం మంజీరా నుంచి వస్తున్న 8 ఎంజీడీల నీటితో పాటు గండిపేట నీటిని 3 ఎంజీడీ స్థానికంగానే శుద్ధి చేసి సరఫరా చేస్తున్నామన్నారు. చాలా అపార్ట్‌మెంట్‌లలో బోర్లు వట్టిపోవటంతో ట్యాంకర్ల బుకింగ్ పెరిగిపోయిందని, అందుకు అనుగుణంగా సరఫరాకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. మరో మూడు రోజుల్లో బీఆర్‌సీ అపార్ట్‌మెంట్ వద్ద ఫిల్టర్ నుంచి మరో రెండు ఎంజీడీ నీరు అందుబాటులోకి వస్తుందని, అది వస్తే మరింత వెసలుబాటు కలుగుతుందన్నారు. కొత్తగా పుప్పాలగూడ ఎల్ఐసీ కాలనీలో త్వరలో మరో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎక్కడ ఎలాంటి నీటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో కొత్త డ్యూయల్ డిగ్రీ కోర్సు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో కొత్త కోర్సును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇది కొత్త డ్యూయల్ డిగ్రీ కోర్సుగా దీన్ని ప్రారంభిస్తారు. కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్(ఆనర్స్), ఎంఎస్ పరిశోధన ద్వారా జియోస్పేషియల్ టెక్నాలజీలో(సీజీడీ) అయిదు సంవత్సరాల కోర్సును ప్రారంభిస్తారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి దాని ట్రాన్స్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ కోర్సుకు జియోస్పేషియల్ టెక్నాలజీలో కొత్త కోర్సును ప్రారంభిస్తోంది. ఈ కోర్సులో సీఎస్‌లో బీటెక్(ఆనర్స్), పరిశోధన డొమైన్ ప్రాంతాలలో మాస్టర్ ఆఫ్ సైన్స్‌ని మిళితం చేస్తాయి. ఈ సీజీడీ ప్రోగ్రామ్‌కి అడ్మిషన్లు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ అండర్ గ్రాడ్యుయేట్ ఎంటర్ ఎగ్జామినేషన్ (యూజీఈఈ) ద్వారా ఉంటాయి. జూన్-2024 నాటికి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో 12వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఆర్థిక లావాదేవీల విషయంలో వ్యక్తిపై కత్తితో దాడి

సంతోష్‌నగర్: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన గురువారం ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బడంగ్‌పేట్‌కు చెందిన సాయికుమార్ (26) కార్ల క్రయ విక్రయాల వ్యాపారం చేస్తుంటాడు. సాయి కుమార్ 2022లో తన సోదరి వివాహం కోసం పెద్ద నాన్న వెంకటేశ్ కుమారుడైన సంతోష్‌నగర్ కానిస్టేబుల్ మహేశ్ కుమార్ వద్ద రూ.2 లక్షలను 4 శాతం వడ్డీకి తీసుకున్నాడు. అప్పటి నుంచి సాయికుమార్ తీసుకున్న డబ్బులకు వడ్డీ చెల్లిస్తూ ఉన్నాడు. మహేశ్ కుమార్ అసలు డబ్బులు ఇవ్వాలని గత కొన్ని రోజులుగా ఒత్తిడి తేస్తున్నాడు. ఇందులో భాగంగా గురువారం డబ్బుల విషయం మాట్లాకుందామని సాయికుమార్ కారులో మహేశ్ కుమార్ చంద్రయ్య హట్స్‌లోని తన నివాసం వద్ద చేరుకున్నారు. దీంతో డబ్బులు విషయమై మాట్లాడుతుండగా చిన్నపాటి గొడవ జరిగి మాటామాట పెరగడంతో మహేశ్‌కుమార్‌తో పాటు తండ్రి శ్రీశైలం, సోదరుడు జగదీష్‌తో సాయి కుమార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. సాయి కుమార్‌ను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: యువకుడి హత్య కేసులో ఐదుగురు నిందితులను బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ బాగ్ అసద్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఖలీల్(23) అదే బస్తీకి చెందిన కిషన్‌బాగ్ అసద్‌బాబానగర్‌కు చెందిన షేక్ షహబాజ్(22), షేక్ షానవాజ్(23), షోయబ్‌ఖాన్(30), మహ్మద్ ఫారూఖ్(20), సయ్యద్ అక్బర్(29), జువైనల్ బాయి అందరూ స్నేహితులు. ఈనెల 15న మద్యం సేవించిన సమయంలో ఖలీల్, మైనర్ బాలుడిపై దాడి చేశాడు. ఇది గమనించిన షహబాజ్ ఖలీల్‌తో గొడవపడి ఒకరినొకరు కొట్టుకున్నారు. స్థానికులు కల్పించుకొని అందరిని విడగొట్టారు. ఈ ఘటననను సీరియస్‌గా తీసుకున్న షహబాజ్ తన మిత్రులతో కలిసి కొద్ది దూరంలోనే ఉన్న ఖలీల్‌పై కత్తితో హత్య చేసి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కార్పొరేషన్ స్థలంలో ప్రహరీని నిర్మించాలి


బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించాలని కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గత నెల రోజుల క్రితం కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి ప్రహరీని నిర్మించాలని కోరామన్నారు. స్థలం హద్దులను ఇప్పటికే గండిపేట్ తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్ధారించి హద్దుల స్కెచ్‌ను కమిషనర్‌కు అందజేశారన్నారు. 2020లో జూన్ 12న జిల్లా కలెక్టర్ సర్వే నెంబర్ 181లోని రెండు ఎకరాల ఏడు గుంటల స్థలాన్ని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి కేటాయించారన్నారు. భవన నిర్మాణానికి కేవలం 2500 గజాల స్థలంలో నిర్మించి వాస్తు పేరిట అలాగే ఈ భవనం వెనకాలే ఉన్న అక్రమ లేఅవుట్‌కు దారి చూపేందుకు కార్పొరేషన్ భవనాన్ని పూర్తిస్థాయిలో కలెక్టర్ ఇచ్చిన స్థలంలో నిర్మించలేదన్నారు. ఈ లేఅవుట్‌కు ఎలంటి అనుమతులు లేవన్నారు. అలాగే కన్వర్షన్ లేకుండానే ఇక్కడ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. బండ్లగూడ కార్పొరేషన్ నుంచి ప్లాట్ నెంబర్ లేకుండా కేవలం ప్లాట్ నెంబర్ బదులు ఏబీసీడీ అంటూ పర్మిషన్లు ఇస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఏబీసీడీ పేరిట ఎక్కడ పర్మిషన్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కానీ బండ్లగూడ జాగీరు మున్సిపల్‌లో ప్లాట్ నెంబర్ బదులు ఏబీసీడీలో వేసి పర్మిషన్లు ఇస్తున్నారన్నారు. ఈ భవనాలకు కార్పొరేషన్ భవనానికి చెందిన స్థలం నుంచి దారి చేపుతూ నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారన్నారు. తాము కార్పొరేషన్ భవనానికి సంబంధించిన స్థలాన్ని కాపాడాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికే తహసీల్దార్ ఆధ్వర్యంలో హద్దులు నిర్ణయించి స్కెచ్ వేసి అందించారన్నారు. వెంటనే ప్రహరీని నిర్మించాలన్నారు.

వారసత్వ ప్రదేశాలపై డాక్యుమెంటేషన్‌కు ప్రతిపాదనలు ఆహ్వానం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్

గచ్చిబౌలి: తెలంగాణ వారసత్వ ప్రదేశాలపై డాక్యుమెంటేషన్ కోసం ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్ తెలిపారు. గురువారం వరల్డ్ హెరిటేజ్ డేను పురస్కరించుకొని రాష్ట్ర అదనపు కార్యదర్శి ప్రశాంతితో కలిసి ఆమె వరల్డ్ హెరిటేజ్ డే పోస్టర్‌ను విడుదల చేశారు. తెలంగాణ వారసత్వ సంపదపై డాక్యుమెంటేషన్ చేయాలనుకునే వారు మే 15 లోపు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సంస్కృతి, సహజ సంపదలను డాక్యుంటేషన్ చేయడం కోసం విశ్వ విద్యాలయాలు, రిసెర్చ్ స్కాలర్స్, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొనాలను ఆమె సూచించారు.

ప్రజలకు అండగా ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే


రాయదుర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: ప్రజలకు అండగా ఉండేది రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలో ఇంటింటి ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా హస్తం గుర్తుకు ఓటేయండి, కాంగ్రెస్ పార్టీని గెలిపించండి అని ఆయన కోరారు. చేవెళ్ళ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ జి రంజిత్‌రెడ్డికి శేరిలింగంపల్లి ప్రజలంతా సంపూర్ణ మద్దతుగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు.